ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా అవతరించిన టీఆర్ఎస్ నాడు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బలమైన కేడర్.. సంస్థాగత కమిటీలతో ఎంతో బలంగా ఉండేది. రాష్ట్ర ఆవిర్భావం జరిగి 2014లో అధికారం చేపట్టాక కూడా తిరుగులేని శక్తిని ప్రదర్శించింది. కానీ 2016లో జిల్లాల విభజన తర్వాత జిల్లా కార్యవర్గాలు, అనుబంధ కమిటీల నియామకాలను మరిచిపోయింది. చివరకు 2022లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి.. నాటి ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లకే అధ్యక్ష పదవులను అప్పగించి.. కార్యవర్గాలను పూర్తిచేయలేదు. ఇక పార్టీ మండల, అనుబంధ సంఘాలదీ అదే పరిస్థితి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయానికి ఇది కూడా ఓ కారణమేనన్న చర్చ జరిగింది. ఇక ఆ ఎన్నికలతో పాటు పార్లమెంట్ పోరులో ఎదురైన ఫలితాలతో అటు నేతలు.. ఇటు కేడర్ డీలా పడింది. ఆ పరిస్థితుల నుంచి బయటపడేలా దిశా నిర్దేశం చేసేలా అధినాయకత్వం ఎలాంటి కార్యాచరణ తీసుకోకపోవడం, సరైన రీతిలో గళం విప్పకుండా మౌనంగా ఉండటం పట్ల కేడర్ అసంతృప్తిగా ఉంది. ప్రస్తుతం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం.. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలో ఆవహించిన 'నిశ్శబ్దం'తో తమ భవిష్యత్ ఏంటన్న ఆందోళన ద్వితీయ శ్రేణి నాయకుల్లో కనిపిస్తోంది. ఎన్నాళ్లిలా మౌనంగా ఉండాలన్న ఆవేదన వారి నుంచి వ్యక్తమవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఎన్నాళ్లీ మౌనం?

సంస్థాగత ఎన్నికలపై దృష్టిపెట్టని బీఆర్ఎస్

- అధిష్ఠానం తీరుపై తీవ్ర అసంతృప్తిలో కేడర్
- 2022లో జిల్లా అధ్యక్షుల నియామకం
- ఆ తర్వాత కార్యవర్గం ఊసు మరిచిన వైనం
- మూడేళ్లైనా కానరాని కొత్త కమిటీలు
- అనుబంధ సంఘాలనూ పట్టించుకోని నాయకత్వం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత ముఖం చాటేసిన కీలక నేతలు
- 'లోక్‌సభ'కు ముందు వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి అరూరి గుడ్‌బై
- పది నెలలైనా కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితి
- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళా కనిపించని హడావుడి
- స్థానిక సమరం సమీపిస్తున్నా ఈ పరిస్థితేంటని శ్రేణుల ఆవేదన
- భవిష్యత్‌పై కార్యకర్తల్లో సన్నగిల్లుతున్న ఆశలు

పదేళ్లు అధికారంలో ఉన్న 'గులాబీ' దళంలో.. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత జోష్ కనుమరుగైంది. సంస్థాగత ఎన్నికలు సమీపిస్తున్నా ఆ ఉత్సాహం మాత్రం కానరావడం లేదు. మూడేళ్ల క్రితం కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించిన అధిష్ఠానం జిల్లా కార్యవర్గాలు, అనుబంధ కమిటీల నియామకాలను మరిచిపోయింది. 2014కు ముందు ఉద్యమ నేపథ్యంలో సంస్థాగతంగా ఎంతో బలంగా ఉన్న బీఆర్ఎస్ ను అధికారంలోకి వచ్చిన తరువాత మరింత బలోపేతం చేసే దిశగా అధినాయకత్వం దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి.ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. అధికారం కోల్పోవడం.. లోక్‌సభ ఎన్నికల్లోనూ అనుకూలించని పరిస్థితుల్లో కేడర్ మరింత నిరుత్సాహానికి గురైందన్న అభిప్రాయాలున్నాయి. ఇందుకు పార్లమెంట్ ఎన్నికలకు ముందు అంటే పది నెలల క్రితం ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజీనామా చేయగా.. ఇప్పటికీ కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితిలో ఉందనే ఆవేదన క్యాడర్‌లో ఉంది. ప్రస్తుత టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కూడా 'గులాబీ' దళం మౌనంగా ఉంటోంది. ఇక వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో జిల్లా, మండల కమిటీలు లేకుండా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆందోళనలో నాయకులున్నారు. ఇదిలానే కొనసాగితే తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటోందనని కార్యకర్తలు దిగులు చెందుతున్నారు. రాజకీయంగా ఎదగాలన్న ఆశతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మూడేళ్లుగా కార్యవర్గాలు లేకుండానే..

తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్‌కు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలున్నాయి. వాటితో పాటు

మిగతా 7వ పేజీలో...

వరుస ఓటములతో కేడర్‌లో నిర్వేదం..

2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కేడర్ డీలా పడింది. ఆ తరువాత 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో ఓటమి గులాబీ శ్రేణులను మరింత కుంగదీశాయి. వీటికి తోడు జూలై జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఓటమితో బీఆర్ఎస్ సైలెంట్ అయిపోయింది. వరుసగా మూడు ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సత్తా చాటడంలో బీఆర్ఎస్ వెనుకబడటంతో కేడర్‌లో నిరుత్సాహం పెరిగింది. దీంతో ఏడాది కాలంగా గులాబీ శ్రేణులు అడపదడపా కార్యక్రమాలకే పరిమితమవుతున్నారు. పార్టీ పిలుపునిచ్చే ఆందోళన కార్యక్రమాల్లో కూడా కొంతమంది నేతలు అంటిముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల ముందు కీలక నేతలు కారు దిగారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీలోకి వెళ్లగా, వరంగల్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మేయర్ గుండు సుధారాణితో పాటు కీలకమైన నేతలు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. దీంతో క్యాడర్‌లో నిరుత్సాహం నిండింది. వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి గత ఏప్రిల్ నెలలో అరూరి రమేష్ రాజీనామా చేస్తే పది నెలలు కావస్తున్నా కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితిలో అధిష్ఠానం ఉన్నదనే నిర్వేదంలో కార్యకర్తలున్నారు. వరంగల్‌తూర్పు మాజీ ఎమ్మెల్యే నరేందర్, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్నతో పాటు మరికొందరు నేతలు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించినప్పటికీ, అధిష్ఠానం ఖాళీగానే ఉంచిందికానీ, ఎవరికి అప్పగించ లేదని సొంతపార్టీలోనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ జయరాంరెడ్డి

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి అన్నారు. భూపాలపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, అలవాట్లకు వ్యాధికి కారణం అవుతోందని అన్నారు. ఈ మహమ్మారి నుంచి రక్షణ పొందాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్లాస్టిక్, పొగాకు వాడకం, ధూమపానం చేయడం క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని తెలిపారు. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రియాంక, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, రోహిణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నిశీధర్‌రెడ్డి

రెండోసారి దక్కిన పదవి



ఏడునూతల నిశీధర్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): : బీజేపీ జయశంక ర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఏడునూతల నిశీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నిశీధర్‌రెడ్డి ఎన్నిక కావడం ఇది రెండోసారి. గత ఏడాది జనవరిలో ఆయన మొదటిసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పార్టీని బలోపేతం చేయడంలో చురుకైన పాత్ర పోషించడంతో మళ్లీ ఆయనకే అవకాశం కల్పించినట్టు బీజేపీ ముఖ్య నేతలు పేర్కొన్నారు. రాజకీయ కుటుంబం నుంచే వచ్చిన నిశీధర్‌రెడ్డి 2019లో రేగొండ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన తండ్రి విజేందర్‌రెడ్డి గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. బీజేపీ మండల అధ్యక్షుడి గా కొనసాగారు. నిశీధర్‌రెడ్డికి దివంగతమాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి స్వయాన మేనమామ. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నిశీధర్‌రెడ్డి భూపాలపల్లి నియోజకవర్గఇన్‌చార్జిగా, జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రికిషన్‌రెడ్డికి సన్నిహితుడిగానిశీధర్‌రెడ్డిగుర్తింపు పొందారు.

బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి



పవన్ (ఫైల్)

టేకుమట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని రాఘవపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన పంచిక పవన్ (19) తన స్నేహితులతో కలిసి టేకుమట్ల మండల కేంద్రానికి వచ్చాడు. తిరిగి గిద్దెముత్తారం వెళ్తున్న క్రమంలో రాఘవపూర్ శివారులో ఇతడి బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. దీంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిట్యాలలో ఇంటర్ సెకెండియర్ చదువుతున్నాడు. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా బయటకు వెళ్లిన పవన్ విగతజీవిగా ఇంటికి చేరాడు. మృతుడి తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

మహదేవపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదావరిలో మహారాష్ట్రకు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మహదేవపూర్ మండల కేంద్రంలో గోదావరి ఒడ్డున రైతులు ప్రతి ఏడాది భారీ ఎత్తున మిర్చి పంట వేస్తారు. పంటను కోసేందుకు మహారాష్ట్ర నుంచి వందల సంఖ్యలో కూలీలను రప్పిస్తారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఏటపల్లికి చెందిన 22 ఏళ్ల మహేష్ మిర్చి ఏరేందుకు వచ్చాడు. తోటి కూలీలతో కలిసి గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మడుగులో పడి గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు.

బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు

తీరని అన్యాయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేసిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్‌పై సోమవారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ప్రధాన రోడ్డు పక్కన టెంట్ వేసి భైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ బడ్జెట్ కేటాయించినట్లు అర్థమవుతోందని విమర్శించారు. బీహార్ ఎన్నికల కోసమే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు తెలుస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పనిచేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా వ్యవరించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలోని కేంద్ర మంత్రులు, ఎంపీలు తలదించుకోవాలని అన్నారు గిరిజన యూనివర్సిటీకి, బయ్యారం ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. దీనికి తోక పార్టీ బీఆర్ఎస్ వంతపాడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ కలిసి రావాలని, తద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళనలు ఉధృతం చేయాలని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఇప్పటికైనా కేంద్రం నిధులు ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే.. మనుషులోయ్ అని చెప్పిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ దేశ ప్రజల బాగుకోసం బడ్జెట్‌లో ఏం కేటాయించారో చెప్పాలని ప్రశ్నించారు.

దేశంలో కోట్లాదిమంది ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర కొంరయ్య, అంబాల శ్రీనివాస్, ఇస్లావత్ దేవన్, సాంబమూర్తి, ముంజాల రవీందర్, పంతగాని సమ్మయ్య, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్రీడలు ప్రారంభం

ఆకట్టుకున్న ఆటలు



క్రికెట్ ఆడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): పోలీసు క్రీడలు భూపాల పల్లిలోని అంబే ద్కర్ స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ కిరణ్‌ఖరే, అటవీ శాఖ అధికారి ఎం. నవీన్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ హాజరయ్యారు. శాంతి కపోతాలను, బెలూన్లను గాల్లోకి ఎగరవేసి ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆర్ఐ రత్నం నేతృత్వంలో నాలుగు బృందాలతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ క్రీడోత్సవాల్లో ఎస్పీ కిరణ్ ఖరే, డీఎఫ్‌వో, సబ్ కలెకర్, సింగరేణి జీఎం, అదనపు ఎస్పీలు వాలీబాల్, క్రికెట్ ఆడి ఆకట్టుకున్నారు.

క్రీడలలో మానసిక ఒత్తిడి దూరం : ఎస్పీ

పోలీసు ఉద్యోగం శారీరక శ్రమతోపాటు మానసిక ఒత్తిళ్లతో కూడుకుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. దానిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలతో ఐకమత్యం, టీమ్స్ స్పిరిట్, క్రమ శిక్షణ అలవడుతాయని, ఈ పోటీలతో ఉద్యోగులు సైతం కలిసిమెలిసి ఉండే ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ క్రీడోత్సవాల్లో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఘనంగా వసంత పంచమి

జోరుగా అక్షరాభ్యాసాలు

మహదేవపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి అనుబంధ శ్రీ శుభానందాదేవి, సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అర్చకులు, వేదపండితులు సరస్వతి దేవికి పలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షారాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సరస్వతి అమ్మవారి ఆలయంలో అక్షరా భ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నగేషశర్మ, వేద పండితులు వైకుంఠ పాండె, సుబ్రహ్మణ్యంతో పాటు ఆలయ ఈవో మహేష్, గ్రామ ప్రజల పాల్గొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఆలయానికి సోమవారం రూ. 2.40 లక్షల ఆదాయం సమకూరిందని నిర్వాహకులు తెలిపారు.

నేడు రథసప్తమి వేడుకలు

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన సూర్యాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయంలో ఉదయాన్నే అర్చకులు పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.



సరస్వతిదేవి ఆలయంలో వసంతి పంచమి వేడుకల్లో భక్తులు

క్రమంగా.. విస్తరిస్తోంది!


నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు
- పట్టణ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువ
- కేసుల్లో మహబూబాబాద్ జిల్లా టాప్
- ములుగు జిల్లాలో తక్కువ
- మహిళల్లో ఎక్కువ రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్
- తొలిదశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చు

7

గతేడాది ఉమ్మడి జిల్లాలో నమోదైన క్యాన్సర్ కేసులు

మహబూబాబాద్	1,278
హనుమకొండ	598
వరంగల్	552
జనగామ	344
జయశంకర్ భూపాలపల్లి	162
ములుగు	59



సీటు కోసం మహిళల కొట్లాట



కాళేశ్వరం బస్టాండ్‌లో గొడవ పడుతున్న మహిళలు

మహదేవపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం బస్టాండ్‌లో బస్సు సీటు కోసం మహిళలు కుస్తీ పడ్డారు. జుట్టు పట్టుకొని తన్నుకున్నారు. రెండు రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా దీని వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. హనుమకొండ నుంచి కాళేశ్వరం పుణ్య స్థానానికి వెళ్లిన భక్తులు తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఓ మహిళ కర్చీఫ్ వేసి సీటును ఆపుకుంది. అదే సీటులో మరో మహిళ కూర్చోవడంతో వారి మధ్య వాగ్వాదానికి దారి తీసింది. మాటామాటా పెరిగి ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని కొట్లాటకు దిగారు. ఈ గొడవతో బస్టాండ్ ప్రాగణమంతా మార్మోగింది. తోటి ప్రయాణికుల జోక్యంతో ఈ ఘర్షణ సద్దుమణిగింది. అయితే.. ఈ గొడవ దృశ్యాలను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఇది వైరల్ అయ్యింది. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచకపోవడం వల్లే ఇలాంటి గొడవలు నిత్యకృత్యమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మంగపేట పీహెచ్‌సీలో వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

కేంద్ర బృందం సర్కారు ఆస్పత్రుల పరిశీలన

మంగపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి, వాటి పనితీరును పరిశీలించింది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, దాని పరిధిలోని చెరుపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఈ కేంద్ర బృందం సందర్శించింది. బృందంలోని డాక్టర్ మురుగేశన్, డాక్టర్ సెందిల్ కుమార్ వివరాలను సేకరించారు. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవల గురించి పీహెచ్‌సీ వైద్యాధికారిని ఎస్.అఖిల, చెరుపల్లి పల్లెదవాఖాన వైద్యులు జి.తరుణ్, సి.హెచ్. మనోజ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారో సీహెచ్‌వో శారద, హెల్త్ సూపర్‌వైజర్లు ఇంద్రావతి, ముత్తమ్మ, పద్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలను అడిగి తెలుసుకున్నారు. బృందం వెంట డీపీవో చిరంజీవి ఉన్నారు.

ప్రయాగ్‌రాజ్‌లో తప్పిపోయిన వృద్ధుడి ఆచూకీ లభ్యం

కేసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తప్పిపోయిన కేసముద్రం విలేజికి చెందిన వృద్ధుడు కాసాని భిక్షం ఆచూకీ లభించింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గత నెల 27న ప్రయాగ్‌రాజ్‌లో భిక్షం తప్పినపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన కుమారుడు ఐలయ్య అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యూపీ పోలీసులు భిక్షం తప్పిపోయిన ప్రాంతానికి 150 కిలోమీటర్ల దూరంలోని కాశీ ప్రాంతంలో ఆయన్ను గుర్తించారు. భిక్షం నుంచి వివరాలు సేకరించి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కాశీ పోలీసులు సమాచారం అందించగా అక్కడి నుంచి కేసముద్రం పోలీస్‌స్టేషన్ ద్వారా ఆయన కుమారునికి ఈ విషయాన్ని తెలిపారు. యూపీకి చెందిన ఒక కానిస్టేబుల్ సంరక్షణలో భిక్షంను ఉంచారు. మంగళవారం రైలు ద్వారా భిక్షం, కానిస్టేబుల్ బయలుదేరి బుధవారం వరంగల్‌కు చేరుకుంటామని సమాచారం అందించారు. తమ తండ్రి ఆచూకీని కోసం ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లికి చెందిన ఉత్తర్‌ప్రదేశ్ ఐజీ రాములు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన చొరవ చూపి కొన్నిగంటల్లోనే గుర్తించారని ఐజీకి ఐలయ్య ధన్యవాదాలు తెలిపారు. ఎట్టకేలకు భిక్షం ఆచూకీ లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నైనా గుహలను సందర్శించిన ఫ్రాన్స్ దేశస్థురాలు



నైనా గుహలను పరిశీలిస్తున్న సోలెన్

మల్హర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ అటవీ ప్రాంతంలోని నైనా గుహ(జైన గుళ్ల)లను ఫ్రాన్స్‌కు చెందిన పరిశోధకురాలు సోలెన్ సోమవారం సందర్శించారు. ఒకే రాతిలో నిర్మించిన గుహల శిల్ప సౌందర్యాన్ని, భారతీయ రాతి కట్టడ నిర్మాణ శైలిని చూసి మంత్రముగ్ధులయ్యారు. గుహ లోపల ఉన్న చిత్రాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం చూసి అలనాటి చిత్రకళను తన కెమెరాలో బంధించింది. భారతీయ చిత్ర కళా సంపద నైపుణ్యంతో కూడికున్నదని కితాబు ఇచ్చారు. రాబోయే తరాలు ఇలాంటి అద్భుతమైన చారిత్రక వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నారు.

పట్టాదార్ పాస్‌బుక్‌లు ఇవ్వాలి

- పెట్రోల్ బాటిళ్లతో వాటర్ ట్యాంక్ ఎక్కిన రైతులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

కేసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏడేళ్లుగా పట్టాదారు పాస్ పుస్తకాల కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురానికి చెందిన పది మంది వరకు రైతులు పెట్రోల్ బాటిళ్లతో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కొనసాగుతుండగానే తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంద మంది రైతుల వరకు ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మానుకోటలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడంతో భారీ ఎత్తున పోలీసులు చేరుకొని అధికారులతో మాట్లాడించి రైతులతో ఆందోళన విరమింపజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతుల ఆందోళనలతో ఉత్కంఠత నెలకొంది. కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం పక్కనే పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకుపైకి సోమవారం ఉదయం పలువురు రైతులు ఎక్కారు. చేతిలో పెట్రోల్ సీసాలను పట్టుకొని ఆందోళన వ్యక్తం చేయడం కలకలంరేపింది. వీరి ఆందోళన కొనసాగుతుండగానే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ గ్రామానికి చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. 'మా పట్టాభూములకు పట్టాలివ్వాలని, కలెక్టర్ రావాలని' నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ 2018లో భూప్రక్షాళనలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ గ్రామంలోని 60 ఏళ్లుగా సాగు చేస్తున్న 1827 ఎకరాలను అటవీభూములుగా పేర్కొంటూ పట్టాపాస్ పుస్తకాలన్నీ రద్దు చేసిందని తెలిపారు.

2021లో అటవీభూములను రెవెన్యూ శాఖకు చెందినవిగా తాము ఆధారాలు తీసుకురావడంతో తిరిగి పట్టాలు జారీ చేసేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పలుమార్లు నిరాహారదీక్ష, ధర్నాల నేపథ్యంలో అడపాదడపా 700 ఎకరాల వరకు పట్టాలు అందగా మిగతా 1124 ఎకరాల్లో పట్టాలు రావాల్సి ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో సచివాలయం ముట్టడి చేయగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే విషయంపై ఇటీవలె మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించి నారాయణపురం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అయినప్పటికీ నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో పట్టాలు జారీ కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో ఏడేళ్లుగా తమ గ్రామానికి రూ.15కోట్ల రైతుభరోసా, 50 మందికి రూ.2.5కోట్ల రైతుబీమా, రుణమాఫీ, పీఎం కిసాన్ యోజన పథకాలు అందకుండా పోయాయని తెలిపారు. ఏకకాలంలో రెండు ఆందోళనలు నిర్వహించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. తొలుత కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నవారికి తహసీల్దార్ దామోదర్, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్‌లు నచ్చజెప్పి ట్యాంకుపైనున్న వారిని కిందికి దింపే ప్రయత్నాలు చేశారు. సుమారు గంటపాటు వాటర్ ట్యాంకుపైనున్న వారు నిరసన వ్యక్తం చేసిన అనంతరం కలెక్టర్ ఫోన్‌లో రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న రైతులు

కలెక్టరేట్ వద్ద ధర్నా.. మోహరించిన పోలీసులు

అనంతరం నారాయణపురం రైతులు మహబూబాబాద్‌కు తరలివెళ్లి అక్కడ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత బయట గేటు వద్ద ధర్నా చేసి ఆ తర్వాత సమీకృత భవనం ప్రవేశద్వారం వద్దకు వెళ్లి ఫ్లెక్సీతో నినాదాలు చేశారు. నిమిషాల వ్యవధిలో నలుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 50 మంది పోలీసులు భారీ సంఖ్యలో తరలివచ్చి రైతుల ఆందోళన వద్ద మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. నలుగురు రైతులు ప్రతినిధులుగా కార్యాలయంలోని వెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అధికారులు, సర్వేయర్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టి రైతులందరికీ పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి, మాజీ సర్పంచ్ పి.లక్ష్మీపతి, ఎడవెల్లి వెంకట్‌రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, జాటోత్ వెంకన్న, బాషా, భీమా, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవితి తల్లి ప్రేమ చూపుతోందని, తెలంగాణ ద్రోహి మోదీ అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కొమ్మూరి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. శ్రీహరి మాట్లాడుతూ సోనియాగాంధీ దయతో రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని, అప్పుడు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే వచ్చేదికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం 10ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణ నిధులు కేటాయించకుండా అవమానిస్తోందన్నారు. కనీసం విభజన హామీలను కూడా అమలు చేయలేదన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు వేల కోట్లతో బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్ట్‌లకు కేంద్రం ఎందుకు జాతీయ హోదా ఇవ్వడంలేదని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయో కేవలం ఆ రాష్ట్రానికి మాత్రమే నిధులు కేటాయిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందన్నారు.

కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను తిట్టడానికే కేంద్ర మంత్రులు అయ్యారని, మోదీ చెప్పినట్టు గంగిరెద్దుల తల ఊపడం తప్ప తెలంగాణ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమిలేదన్నారు. బీజేపీ 8 మంది ఎంపీలు చవటలు, దద్దమ్మలు అని వారికి తెలంగాణ మీద ప్రేమ ఉంటే నిధులు తీసుకురావాలన్నారు. లేదంటే మూకుమ్మడిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిలిచిన ధరణి రిజిస్ట్రేషన్లు

- మానుకోట జిల్లా వ్యాప్తంగా ఆపరేటర్ల బదిలీలు
- కొత్త మండలంలో లాగ్‌ఇన్ ఐడీల జారీలో సాంకేతిక లోపం
- ఆరు రోజులుగా ఆగిన కొత్త స్లాట్ బుకింగ్‌లు.. తగ్గిన ఆదాయం

Integrated Land Records Management System DHARANI

కేసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా కొనసాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు ఆరు రోజులుగా నిలిచిపోయాయి. జిల్లాలో 18 తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, బహుమతి, వారసత్వ బదిలీలు, తనఖా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. రోజుకు ఒక్కో కార్యాలయంలో సగటున 4 నుంచి 5 వరకు సుమారు 70 వరకు వివిధ రకాల రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

ఇందుకోసం ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో ఒక ధరణి ఆపరేటర్‌ను ప్రభుత్వం నియమించింది. వీరిని ప్రతీ ఏడాది, రెండేళ్లకొకసారి బదిలీ చేస్తుంటారు. గత ఏడాది తొర్రూరు, కేసముద్రం, కొత్తగూడ మినహా అందరినీ బదిలీ చేయగా తాజాగా గతనెల 29న జిల్లాలోని 18 మందికి స్థానచలనం కల్పించారు. దీంతో ఆయా ఆపరేటర్లు తమకు కేటాయించిన మండలాలకు అదే రోజున బదిలీపై వెళ్లిపోయారు. అయితే రిజిస్ట్రేషన్లు చేయాలంటే ధరణి పోర్టల్‌లో కొత్తగా బదిలీపై వచ్చిన ఆపరేటర్ పేరిట ఆ కార్యాలయంలో లాగ్‌ఇన్ ఐడీని సృష్టించాల్సి ఉంది.

ఆపరేటర్ లాగ్‌ఇన్ ఐడీకి ఆటంకాలు

ఆపరేటర్‌కు లాగ్‌ఇన్ ఐడీని ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా సదరు ఆపరేటర్ లాగ్‌ఇన్ ఇంతకుముందే ఉన్నట్లుగా చూపుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. గతంలో కొత్త లాగ్ ఇన్ ఐడీ జారీ కోసం తొలుత పాత ఆపరేటర్ వివరాలను తొలగించేందుకు 'డెలీట్' ఆప్షన్ ఉండగా అది ప్రస్తుతం పనిచేయడం లేదని కొందరు సిబ్బంది తెలిపారు. ఫలితంగా జిల్లాలో బదిలీలపై మారిన 18 మంది ధరణి ఆపరేటర్లకు కొత్తమండలంలో లాగ్‌ఇన్ ఐడీలు లేక గత నెల 29 నుంచి ఆరు రోజులుగా ఖాళీగా ఉంటున్నారు. దీంతో ధరణిలో వివిధ రకాల రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి.

రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం కొనుగోలు, విక్రయదారులు, సాక్ష్యులు అంతా కార్యాలయానికి వస్తూ ధరణి పరిస్థితి తెలుసుకొని ఉసూరుమంటూ వెళ్తున్నారు. ధరణి రిజిస్ట్రేషన్లు మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారనేది కార్యాలయంలో స్పష్టంగా చెప్పలేకపోతున్నారని స్లాట్‌బుక్ చేసుకున్న అర్జీదారులు చెబుతున్నారు. మరోవైపు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో కొత్తగా స్లాట్‌బుక్ చేసుకునేందుకు వెనుకాడుతుండడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కొంత తగ్గుముఖం పట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు కోరుతున్నారు.

బస్సులో గుండెపోటుతో మహిళ మృతి



శంకరమ్మ (ఫైల్)

తాడ్వాయి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో సోమ వారం చోటు చేసుకుంది. తోటి ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన పల్లపు శంకరమ్మ (58) అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం కోసం గోవిందరావుపేట పస్రా గ్రామానికి వెళ్లేందుకు నార్లాపూర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె కొద్ది దూరం వెళ్లగానే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

వాటర్ ట్యాంక్ ట్రాక్టర్ బోల్తా

పంచాయతీ కార్మికుడికి గాయాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి వాటర్ ట్యాంక్ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మేడారం గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ పరిసరాల్లోని మొక్కలకు నీరు పోసేందుకు వెళ్లి మేడారం మహా జాతర ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వనదేవతల గద్దెల వైపు వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న కార్మికుడు గజ్జల ఆశయ్య కిందపడిపోయాడు. దీంతో అతడికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎంపీవో శ్రీధర్‌రావు క్షతగాత్రుడిని ములుగు ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

కాటారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని చింతకానిలో భూనీళా సమేత చెన్నకేశవస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. స్వయంభు వెలిసిన చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతి ఏటా వసంతపంచమి సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మొదటి రోజు స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజారోహణంతో మొదలై స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి నిర్వహించిన కల్యాణంతో వైభవంగా ముగిసింది. ఉత్సవ కమిటీ సభ్యులు నిడిగొండ షైనర్‌బాబు-పద్మ, అడప శ్యాం-స్వాతి దంపతులు చేతుల మీదుగా కనుల పండువగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో కొండపర్తి శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్, బచ్చు ఈశ్వరయ్య, వేముల బొర్రాజు, నిడిగొండ రవి, చకినాల రాజయ్య, ముక్కెర శ్రీనివాస్, కోసరి జయప్రదతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకాని మాజీ ఎంపీటీసీ విజయారెడ్డి, మాజీ సర్పంచులు ఫిరోజ్‌ఖాన్, మందల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోసరి భాస్కర్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, వేదపండితులు పాండురంగ శర్మ, దహగం కృష్ణమూర్తి, లోకె సురేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని ములుగు పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ట్రాలీ వాహనం సమాచారాన్ని తెలుసుకున్న ములుగు బీజేపీ నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈక్రమంలో ఆ వాహనం అతివేగంతో అదుపుతప్పి మల్లంపల్లిలో రోడ్డు పక్కన ఉన్న ఓ టిఫిన్‌సెంటర్ బండిని ఢీకొట్టి ఆగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వాహనాన్ని స్వాధీన పరచుకున్నారు. డ్రైవర్ పరారీ అయ్యాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పల్లికాయ (సూక)	6000	4600
పల్లికాయ (పచ్చిది)	5500	3100
కందులు	6582	5540
పెసళ్లు	6059	5133
పత్తి	7000	5800
తేజ మిర్చి	13900	9000
వండర్‌హాట్	14800	11500
యూఎస్ 341 ఏసీ	14000	11500
ఎల్లో మిర్చి	16500	13500
తాలు మిర్చి	6500	3000

\- వరంగల్ వ్యవసాయం

వేంకటేశ్వరస్వామి ఆలయ మూర్తి ప్రతిష్ఠాపన

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే హాజరు
- రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు, హోమాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయమూర్తి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఆలయ నిర్మాణ బాధ్యులు, మాజీ సర్పంచ్ యాస రమావెంకట్‌రెడ్డి, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జనవరి 30 నుంచి ఆలయంలో ప్రారంభమైన పూజలు సోమ వారంతో ముగిసాయి. చివరి రోజు ఉదయం 7 గంటలకు ప్రాబోధకి, 7:30 గంటలకు నిత్యహవనం, పారాయణాదులు, 9:50 గంటలకు రేవతి నక్షత్రమీన లగ్నంలో (వసంత పంచమి) పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో గర్తన్యాసం, గర్తపూజ వేంకటేశ్వరస్వామి యంత్ర -మూర్తి ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ముడుపుగల్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ మూర్తి ప్రతిష్ఠామహోత్సవానికి భక్త జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముడుపుగల్ గ్రామ వాసులతో పాటు వారి బంధువులు, మహబూబాబాద్ జిల్లాకేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం భక్త జన సంద్రోహంగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఐదు రోజుల పాటు ఆలయంలో అర్చకుడు టీకే. శ్రీనివాసన్ నేతృత్వంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య నేతృత్వం లో ఎస్సైలు శివ, దీపికారెడ్డి, సతీష్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెరిపోతుల వెంకన్న, మిట్టకంటి రామిరెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, హరిత, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ముత్యం వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, లూనావత్ ప్రియాంక, సుధగాని మురళీ, అశోక్‌నాయక్, బి. అజయ్‌సారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు మురళీనాయక్, మాధవరెడ్డి, భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

క్రమంగా.. విస్తరిస్తోంది!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

- పట్టణ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువ
- కేసుల్లో మహబూబాబాద్ జిల్లా టాప్
- ములుగు జిల్లాలో తక్కువ
- మహిళల్లో ఎక్కువ రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్
- తొలిదశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చు
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ క్రమంగా విస్తరిస్తోంది. రాష్ట్రంలో క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి మహబూబాబాద్ జిల్లాలో క్యాన్సర్ తీవ్రత అధికంగా ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నాయి. ములుగులో అతితక్కువ కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ తరహా క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స చేయించుకుంటే ప్రాణాపాయం తప్పుతుందంటున్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ ప్రభావంపై కథనం.



పట్టణాల్లోనే ఎక్కువ

హనుమకొండ, వరంగల్ జిల్లాలోనే ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నట్టు ఇటీవల జరిపిన సర్వేలో తేలింది. వీరిలో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్‌కు గురవుతున్నారు. ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించకపోవడం, ధూమ పానం, మద్యపానంకు అలవాటు పడడం తదితర కారణాల వల్ల పురుషుల్లో క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది.

క్యాన్సర్ కేసులు ఇలా...

హనుమకొండ జిల్లాలో గత సంవత్సరం మొత్తం 598 కేసులు నమోదయ్యాయి. ఇందులో నోటి క్యాన్సర్ 83, రొమ్ము క్యాన్సర్ 215, సెర్వికల్ క్యాన్సర్ 111, ఇతర రకాల క్యాన్సర్ కేసులు 189. కాగా, వరంగల్ జిల్లాలో మొత్తం 552 కేసులు నమోదు కాగా ఇందులో నోటి క్యాన్సర్ 235, రొమ్ము క్యాన్సర్ 192, సెర్వికల్ క్యాన్సర్ 125. ములుగు జిల్లాలో మొత్తం 59 కేసులు నమోదు కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 162 మంది వ్యాధి బారిన పడ్డారు. వీరిలో రొమ్ము క్యాన్సర్ 38, నోటి క్యాన్సర్ 26, సర్వికల్ క్యాన్సర్ 48, ఊపిరితిత్తుల క్యాన్సర్ 32 కేసులు రికార్డయ్యాయి.

జనగామ జిల్లాలో మొత్తం 344 కేసులు నమోదయ్యాయి. ఇందులో సర్వైకల్ క్యాన్సర్ 97, రొమ్ము క్యాన్సర్ 79, నోటి క్యాన్సర్ 31, ఇతర కేసులు 137 రికార్డయ్యాయి. కాగా, మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 1,278 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ రొమ్ము క్యాన్సర్ కేసులే ఎక్కువగా 383 ఉన్నాయి. సర్వైకల్ కేన్సర్ 252 కేసులు రికార్డు అయ్యాయి. యుటరస్ 80, బ్లడ్ 20, గొంతు 62, నాలుక 32, మిగతావి ఇతరత్రా కేసులు.

ప్రాథమిక దశలో గుర్తించాలి

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించినట్లయితే దానిని విజయవంతంగా నివారించవచ్చు. క్యాన్సర్ నాలుగు దశల్లో ఉంటుంది. అవగాహన లేకపోవడం వల్ల రోగులు చివరి దశలో చికిత్స కోసం వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. క్యాన్సర్ ఎక్కువగా 40 ఏళ్లు పైబడిన మహిళలకు వచ్చే అవకాశం ఉంది. 60-70 ఏళ్ల మధ్య వయస్కులైనవారికీ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమని డాక్టర్ చెబుతున్నారు. 30 ఏళ్లు పైబడిన మహిళలందరూ ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. క్యాన్సర్ పరీక్షలు ఖరీదైనవనే అపోహ ఉంది.

ఆకలి మందగించినా, బరువు తగ్గినా క్యాన్సర్ వచ్చినట్టు అనుమానించాలి.

పొగాకు వల్ల..

పొగతాగడం వల్ల కూడా క్యాన్సర్ వస్తుంది. బీడీ, సిగరెట్, గుట్కా, పాన్ మసాల వంటివి అధికంగా వినియోగిస్తే అవి క్యాన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా బీడీ, సిగరెట్‌లోని టార్‌లో ఉండే ఆర్గానిక్ కాంపౌండ్లు రేడియం అస్బెస్టాస్. నికోటిన్, క్రోమియం వంటి పదార్థాలు వ్యాధికి కారణమవుతాయి. పొగ తాగే అలవాటు ఉన్నవారు దానిని వెంటనే మానివేయడం ఉత్తమం.

హెచ్చరికలు

క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని హెచ్చరిక సంకేతాలను గుర్తించాలి. అవి అసాధారణ రక్తస్రావం, హఠాత్తుగా బరువు తగ్గడం, తీరని అలసట, నిరంత నొప్పి, చర్మం మార్పులు, గొంతులో అసాధారణ మార్పులు, గడ్డల ఉనికి, క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని లక్షణాలను గమనించాలి. అవి- ఊపిరి తిత్తుల క్యాన్సర్‌కు సంబంధించి నిరంతర దగ్గు, శ్వాస ఆడకపోవడం, చాతినొప్పి, గురక వంటివి.

గొంతు క్యాన్సర్‌కు సంబంధించి గొంతునొప్పి, ఊపిరి ఆడకపోవడం, నిరంతర గొంతు నొప్పి, లేదా దగ్గు. రొమ్ము కేన్సర్‌కు విషయంలో రొమ్ము నొప్పి, అసౌకర్యంగా ఉండడం, వాపు బ్లడ్ క్యాన్సర్ విషయంలో దురద వంటివి క్యాన్సర్ లక్షణాలుగా అనుమానించాలి.

క్యాన్సర్ ఎలా వస్తుందంటే..

క్యాన్సర్ అనేది కణాలు అనియంత్రితంగా విభజించబడి చుట్టు పక్కల కణజాలాలలోకి వ్యాపించినప్పుడు.. డీఎన్ఏలో జరిగే మార్పుల వల్ల క్యాన్సర్ వస్తుంది. చాలా వరకు క్యాన్సర్ కలిగించే డీఎన్ఏ మార్పులు జన్యువులు డీఎన్ఏ విభాగాలలో సంభవిస్తాయి. ఈ మార్పులను జన్యు మార్పులు అని కూడా అంటారు.

క్యాన్సర్ బాధితులు ఆందోళన చెందవద్దు

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు మానసికంగా ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన జీవితాన్ని సాగించాలి. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. మహిళలు బ్రెస్ట్ స్ర్కీనింగ్, సర్వైకల్ క్యాన్సర్ గుర్తింపు కోసం పాప్‌స్మియర్ పరీక్షలను విధిగా చేయించుకోవాలి. 9 సంవత్సరాల నుంచి వివాహం జరిగేంత వరకు మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకుంటే చాలా మంచిది. ఈ మధ్య కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ చాలా మందిలో కనిపిస్తోంది. మాంసాహారం, ఆల్కహాల్, అధిక కొలెస్ట్రాల్ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం ఉత్తమం. ఒక వేళ కేన్సర్ సోకిన ఆందోళన చెందవద్దు. అనేక నూతన ఔషధాలు, ఆధునిక సాంకేతికత కలిగిన రేడియేషన్ చికిత్స, రోబోటిక్ సర్జరీ లాంటివి అందుబాటులో ఉన్నాయి. మొదటి, రెండవ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా జయించవచ్చు.



డాక్టర్ అలేటి రవీందర్ రెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, హనుమకొండ

నేడు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం

» 2 వేల మందితో వాక్‌థాన్ » హాజరు కానున్న సినీ నటి గౌతమి

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ మెంబర్ డాక్టర్ హరిణి బోయినపల్లి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 2 వేల మందితో వాకథాన్‌ను పబ్లిక్ గార్డెన్ నుంచి కళాక్షేత్రం వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా సినీ నటి గౌతమి హాజరవుతారని, ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నాళ్లీ మౌనం ?

(5వ పేజీ తరువాయి)

అనుబంధ సంఘాలకు కూడా కమిటీలను నియమించింది. 2016వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు కార్యవర్గం కూడా ఉంది. అయితే 2016 అక్టోబరు 11న కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత కొత్తజిల్లాలకు కమిటీలను ఏర్పాటు చేయటంలో అధిష్ఠానం తాత్సారం చేసి.. రేపుమాపు అంటు కాలం వెళ్లదీసింది. చివరకు ఐదున్నరేళ్ల తర్వాత 2022 జనవరి 26న కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లకే జిల్లా అధ్యక్ష పదవులను అప్పగించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌భాస్కర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా గండ్ర జ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా కుసుమ జగదీష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా మాలోతు కవిత, జనగామ జిల్లా అధ్యక్షుడిగా పాగాల సంపత్‌రెడ్డిలను నియమించారు. కానీ కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించిన అధిష్ఠానం.. ప్రధానకార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్తకార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితర పదవులను ఎవరికీ కట్టబెట్టలేదు. వీటితో పాటు బీఆర్ఎస్ అనుబంధ సంఘాల కమిటీలు, మండల కమిటీలను కూడా ఏర్పాటు చేయలేదు. అనుబంధ సంఘాల కార్యవర్గాలు లేకపోవటంతో ఆ విభాగంలో పార్టీ కేడర్‌ను సమన్వయం చేసే అవకాశాలు లేకుండా పోయాయన్న విమర్శలున్నాయి. మహిళ, రైతు, యువత, విద్యార్థి తదితర కమిటీలు లేకపోవటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి భారీగా నష్టం వాటిల్లిందనే చర్చ నేటికీ జరుగుతోంది. కేవలం జిల్లా అధ్యక్షులనే నియమించటంతో వారు ఏక్ నిరంజన్‌లుగా వ్యవహరించారని, మూడేళ్లుగా కార్యవర్గాలు లేకపోవటంతో కార్యవర్గ సమావేశాలు జరిగింది కూడా లేదన్న అపవాదు ఉంది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు పార్టీ కార్యాలయాలను మాత్రం నిర్మించగా.. కార్యవర్గం లేకుండా కార్యాలయాలను నిర్మించడంతో అవి ఎందుకు పనికి రాకుండా పోయాయనే విమర్శలున్నాయి. పైగా రాష్ట్ర కార్యవర్గం కూడా 2017 నుంచి లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు రాష్ట్ర స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఏడేళ్లుగా రాష్ట్ర కమిటీ లేకపోవడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీలో పదవులు లేకుండా మాజీలుగానే చెప్పుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరుగుతోంది.

స్థానిక పోరులో గెలిచేదెట్లా?

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటంపై అధిష్ఠానం దృష్టి పెట్టకపోవడంతో కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 27వతేదీన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు వచ్చే మార్చి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. గ్రామ స్థాయిలో అభ్యర్థులను నిలిపి ప్రచారం చేయటంతో పాటు గెలుపు కోసం వ్యూహరచన చేసే పార్టీ జిల్లా, మండల, గ్రామ అధ్యక్షులు లేకపోవటంపై కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు సంస్థాగతంగా పార్టీలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. బీజేపీ వార్డు, బూతు, గ్రామ, మండల, జిల్లా కమిటీలను కూడా ప్రకటించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ జిల్లా కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తుండగా.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఆ సందడి లేకపోవటంపై కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఉద్యమ సమయంలోనే కాకుండా.. పదేళ్లుగా పార్టీ బలోపేతంతో పాటు గెలుపులో కీలకంగా వ్యవహరించిన కార్యకర్తలు ప్రస్తుతం అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుతో అసంతృప్తిగా ఉన్నారు. ఒక్క జనగామ సెగ్మెంట్‌లో మినహా బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేలు లేరు. మిగతా అన్ని చోట్ల మాజీలే దిక్కయ్యారు. ఎన్నికల్లో క్యాడర్‌కు ఎన్నికల ఖర్చులను కూడా సర్దుబాటు చేసే నేతలు లేకపోవటంపై ద్వితీయ శ్రేణి నేతలు దిగులు చెందుతున్నారు. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు ఉండాలని కార్యకర్తలు కోరుతున్నారు. లేదంటే స్థానిక సంస్థల్లో నిలిచేదెలా? గెలిచేదెలా? అని గులాబీ క్యాడర్ అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తోంది. ఇప్పటికైనా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల

తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమవారం ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని, 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు కావడంతో నామినేషన్లు స్వీకరించబోమని, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని, మార్చి 3న తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు తాను రిటర్నింగ్ అధికారిగా, నల్లగొండ అదనపు కలెక్టర్ (రెవిన్యూ) జె.శ్రీనివాస్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు వరంగల్- ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 24,905 మంది ఓటర్లున్నారని వెల్లడించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు నల్లగొండ సమీపంలోని అర్జాల బావి వద్ద ఉన్న మార్కెటింగ్ గోదాంలో ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) మీడియా సెంటర్‌ను ప్రారంభించారు.

తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు

నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాయలయంలో నామినేషనల్ల స్వీకరణ ప్రారంభం కాగా.. తొలిరోజు సోమవారం సూర్యాపేటకు చెందిన లింగిడి వెంకటేశ్వర్లు ప్రజావాణి పార్టీ తరపున నామినేషన్ వేశారు.



ఆశల పంట అందిన వేళ..

ఆరుగాలం శ్రమించి తమ చేతికందిన పంటను చూసుకుని ఆ గిరిజన రైతు దంపతులు మురిసిపోతున్నారు. మార్కెట్లో ఆశించిన మేర ధర లేకపోవడంతో.. అనుకూలమైన ధర వచ్చే వరకు దాచిపెట్టేందుకు వీలుగా ఇదిగో ఇలా పంటను ఆరబెడుతున్నారు గీసుగొండ మండలం మచ్చాపురానికి చెందిన వృద్ధ దంపతులు. తమకున్న రెండున్నర ఎకరాల్లో పండిన పంటను చూసుకుంటూ.. మరికొద్ది రోజులకైనా ఆశించిన ధర రాకపోతుందా అనుకుంటూ మిరపకాయలను ఎండబెడుతున్న దృశ్యాలివీ.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

నమో సూర్యదేవా

• నేడు రథసప్తమి • వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథ సప్తమి అంటే సూర్య భగవానుడి జన్మదినం. సప్తమి రోజున స్వామి వారు రథంపై పయనిస్తారని భావిస్తూ ఆ రోజును రథ సప్తమిగా నిర్వహించుకుంటారు. రథ సప్తమి రోజున యోగోపాసన చేసే వారు పూజలు, వైష్ణవ ఆలయాల్లో అభిషేకాలు నిర్వహిస్తారు.

సూర్య నమస్కారాలు..



యోగోపాసన చేసేవారు సూర్యనారాయణుడిని ఆరాధించే వారు రథ సప్తమి పర్వదినం రోజున సూర్యోదయం జరిగే బ్రహ్మీ ముహూర్తంలో సూర్య నమస్కారాలు చేస్తారు. ఆ సమయంలో సూర్య భగవానుడు బంగారు కిరణాలతో ఆయురారోగ్యం ప్రసాదిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఇంటింటా రథ సప్తమి మొక్కులు

రథ సప్తమి పర్వదినం రోజున శ్రీసమక్క-సారలమ్మలకు బెల్లం, పసుపు, కుంకుమలు, కొబ్బరి కాయలతో, బెల్లం పరమాన్నంతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఏటా రథ సప్తమి రోజున సమ్మక్క- సారలమ్మ పూజలను నిర్వహించుకొని అమ్మవారి దర్శనానికి వెళ్తారు. ఇరుగుపొరుగు వారిని పిలుచుకొని పసుపు, కుంకుమలు, బెల్లం వాయినంగా అందజేస్తారు.

కొత్త కోడళ్లకు నూతన వస్త్రాలు

రథ సప్తమి రోజున కొత్తగా వచ్చిన కోడళ్లకు అత్తవారింటిలో నూతన వస్త్రాలను బహూకరిస్తారు. పసుపు, కుంకుమతో ఆశీర్వదిస్తారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రథ సప్తమి రోజున అమ్మవారి దేవాలయాల్లో, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి శిశిర నవరాత్రుల్లో భాగంగా వచ్చే మాఘ సప్తమి రోజు మంగళవారం రథ సప్తమి సందర్భంగా అమ్మవార్లకు ఒడిబియ్యాలు, నూతన వస్త్రాలను సమర్పిస్తారు. వైష్ణవ ఆలయాల్లో ఆదిత్య హృదయం, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాన్ని నిర్వహిస్తారు. అభిషేకాలు, అర్చనలు కొనసాగుతాయి.

నేడు ఆరు ప్రాంతాల్లో మనగుడి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో మనగుడి కార్యక్రమంలో భాగంగా రథ సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండ జిల్లాలోని నక్కలగుట్ట శ్రీచైతన్య పాఠశాల, వరంగల్ జిల్లాలోని పిన్నవారి వీధిలో గల శ్రీశారద ఉన్నత పాఠశాల, ములుగు జిల్లాలోని శ్రీఅరవింద ఉన్నత పాఠశాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జనగామ జిల్లాలోని ఏకశిల ఉన్నత పాఠశాల, మహబూబాబాద్ జిల్లాలోని విశ్వశాంతి హైస్కూల్‌లో రథ సప్తమి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. రథ సప్తమి పర్వదినం సందర్భంగా సూర్య భగవానుడికి విశేష పూజ, ఆదిత్యహృదయ పారాయణం విద్యార్థులతో సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పాఠశాల విద్యార్థులు, భజన మండలి భక్తులు వారి గ్రామంలోని దేవాలయాల్లో రథ సప్తమి సందర్భంగా ఆదిత్య హృదయ పారాయణం, సూర్య నమస్కారాలు చేసి సాయంకాలం భజన నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

ఒకటే గమనం.. గమ్యం

- » మామునూరు పీటీసీలో రాటుదేలుతున్న పీసీలు
- » కొత్త న్యాయ చట్టాలపై ప్రత్యేక బోధన
- » ఇప్పటివరకు 6,857 మందికి శిక్షణ పూర్తి

మామునూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అదొక పోలీసులను తయారు చేసే కార్ఖానా. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి శిక్షణ కోసం వస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కఠిన నిబంధనలతో తర్ఫీదు పొందుతారు. నేరస్థులను పట్టుకోవడంలో మెళకువలను నేర్చుకుంటారు. కఠోర శ్రమతో యుద్ధవీరుల్లాగా రాటుదేలుతారు. ఇలాంటివి రాష్ట్రంలో 10 శిక్షణ కేంద్రాలు ఉండగా అందులో మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ) ఒకటి. ఇక్కడ ఏకకాలంలో 1200 మంది శిక్షణ పొందేందుకు ఏర్పాట్లు చేశారు.

ఇండోర్..అవుట్ డోర్ విభాగం

మామునూరు పీటీసీలో ఇండోర్ అవుట్ డోర్ విభాగాల్లో ట్రైనింగ్ ఇస్తారు. పోలీస్ శాఖలో ఉండే 12 రకాల తుపాకుల గురించి, అవి పనిచేసే విధానం గురించి వివరిస్తారు. బుల్లెట్స్ లోడ్ చేయడం, ఫైరింగ్, లాఠీ డ్రిల్, వెపన్ డ్రిల్, ఇన్వెస్టిగేషన్ ఆప్స్, హాక్ ఐ, హైడ్రా క్రాఫ్స్, థర్డ్ ఐ, లేటెస్ట్ ఆప్స్, కరాటే, వివిధ రకాల వెపన్స్, క్రిమినల్ లా వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. ఇందులో భాగంగా గుట్టలలో వెపన్ ఫైరింగ్ నేర్పిస్తారు. వారానికి ఒకసారి 5కె రన్ నిర్వహిస్తారు. చట్టాలపై అవగాహన కల్పిస్తారు. సైబర్ క్రైం, ఫోరెన్సిక్, బాంబ్‌స్క్వాడ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తారు. అత్యవసర పరిస్థితులలో తప్పించుకోవడం ఎలాగో కూడా నేర్పిస్తారు.

ఇప్పటి వరకు 29 బ్యాచ్‌లకు శిక్షణ

మొదటగా 2014లో పరేడ్ మైదానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 29బ్యాచ్‌లలో 6857 మందికి శిక్షణ ఇచ్చారు.





రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి శిక్షణ కోసం వస్తారు. ఉదయం 6 గంటలకే శిక్షణ ప్రారంభమవుతుంది. ఉదయం 8:30 వరకు గ్రౌండ్ ట్రైనింగ్, 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఇండోర్ క్లాసెస్ జరుగుతాయి. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు ఆటలు, స్విమ్మింగ్ వ్యాయమం ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు ఇండోర్ విభాగంలో 40 మంది, అవుట్ డోర్ విభాగంలో 120 మంది ఫ్యాకల్టీ ఉన్నారు.

మహిళలు, పురుషులకు వేర్వేరుగా శిక్షణ

పీటీసీలో ఇప్పటివరకు మొత్తం 6857 మంది కానిస్టేబుల్స్‌కు శిక్షణ ఇచ్చారు. వారిలో 2024లో 1148మంది మహిళలు 9నెలల పాటు శిక్షణ పొందారు. వీరిలో ఏఆర్ కానిస్టేబుల్స్ 309మంది, సివిల్ కానిస్టేబుల్స్ 843 మంది ఉన్నారు. వారిలో బీటెక్, పీజీ, డిగ్రీ పూర్తి చేసిన వారే అధికంగా ఉన్నారు.

వెపన్ ఫైరింగ్..

వరంగల్‌లోని జక్కలొద్దిలో రేంజ్ ఫైరింగ్ కోసం 9.5 వెపన్, 200మీటర్ వెపన్ ఫైరింగ్, 300 మీటర్ వెపన్ ఫైరింగ్‌పై ప్రత్యేక నిపుణుల చేత ట్రైనింగ్ ఇస్తారు.

గ్రిడ్ మిర్రర్..

శిక్షణపొందుతున్న కానిస్టేబుళ్లకు ఒక ప్రత్యేక గ్రిడ్ మిర్రర్ ఏర్పాటు చేశారు. ఇది వారి డ్రెస్ కోడ్‌ను, బ్యాడ్జ్‌లను సరిగా ధరించారా లేదా, క్యాప్ సరైనక్రమంలో పెట్టుకున్నారా, సెల్యూట్ చేసే విధానం, స్టాండర్డీజ్ అటేన్షన్ చేస్తున్నప్పుడు రెండు పాదాల మధ్య సరైన స్పేస్ ఉందా లేదా సూచిస్తుంది.





ఇతర వాటికంటే ఎక్కువ ప్రత్యేకతలు

రాష్ట్రంలోని ఇతర పీటీసీల కంటే మామునూరులో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇక్కడ 3 ఆర్‌సీసీ బిల్డింగ్స్, 14 ఫ్యాబ్రికేటెడ్ బారక్స్, 14 విశాలమైన తరగతి గదులు ఏర్పాటు చేశారు.

80 మంది ఒకేసారి ఉపయోగించుకునేందుకు వీలుగా2 కంప్యూటర్ ల్యాబ్స్ ఉన్నాయి. 600 మందితో సమావేశం నిర్వహించేందుకు ఒక మీటింగ్ హాల్ ఉంది. వ్యాయామం కోసం జిమ్, రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, ఒక డ్రిల్ నర్సరీ కూడా అందుబాలో ఉన్నాయి. అభ్యర్థుల ఆరోగ్యం కోసం ప్రత్యేంగా ఒక యూనిట్ హాస్పిటల్ ఉంది.

నాణ్యమైన ఆహారం..

ఇక్కడ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అధిక ప్రోటీన్లతో కూడిన పోషకాహారం అందిస్తారు. బ్రేక్ ఫాస్ట్‌లో కోడి గుడ్లు, పాలు, టీ, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, రాగిజావ, చపాతీ ఇస్తారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో చికెన్‌తోపాటు రెండు రకాల కర్రీస్, పెరుగు ఉంటుంది.


ఒకొక్కరిని ఒక్కో ఆయుధంలా తయారు చేస్తున్నాం..

పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్పీ ఇంజారపు పూజ



అన్ని వాతావరణాలను తట్టుకునేలా, ప్రజలకు అండగా ఉండేలా ఒక్కో కానిస్టేబుల్‌ను ఒక్కో ఆయుధంలా తయారు చేసి పంపుతున్నాం. పోలీస్ జాబ్ అంటే కేవలం ఉద్యోగమే కాదు కర్తవ్యంలా భావించి ప్రజల్లో ధైర్యం నింపేలా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ములుగు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



కొందరికే భరోసా

రైతుల్లో నైరాశ్యం

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా కొంతమంది రైతులకే అందింది. జనవరి 26వ తేదీన పథకాన్ని ప్రారంభించగా జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల రైతుల ఖాతాలలోనే డబ్బులు జమయ్యాయి. దశల వారీగా మార్చి వరకు రైతులందరికీ సాయం అందుతుందని ప్రభుత్వ వర్గాలు ప్రకటన చేశాయి. కానీ, వారంరోజులు పూర్తయినా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడం పథకానికి అవరోధంగా మారిందనే ప్రచారం జరుగుతోంది. కానీ, కోడ్‌కు ముందే రైతుభరోసా మొదల వ్వడంతో పెట్టు సాయం అందించేందుకు ఇబ్బంది కలగపోవచ్చనే వాదన వినిపిస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 6768 మంది రైతుల ఖాతాలలో రూ.8,26,40,946 జమయ్యాయి. ఏటూరునాగారం మండలం ముల్లకట్టకు చెందిన 398 మందికి 4090276, గోవిందరావుపేట మండలం రంగాపూర్‌కు చెందిన 836 మంఇకి రూ.10950765, కన్నాయిగూడెం మండలం కంతనపల్లికి చెందిన 244 మందికి రూ.3587850, మంగపేట మండలం నర్సింహ సాగర్‌కు చెందిన 601 మందికి రూ.10092690, ములుగు మండలం బండారుపల్లికి చెందిన 938 మందికి రూ.10682110, తాడ్వాయి మండలం అకంపల్లికి చెందిన 196 మందికి రూ.3036450, వెంకటాపూర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన 3271మందికి రూ.36904093, వెంక టాపురం మండలం రాచపల్లికి చెందిన 150మందికి రూ.2020914, వాజేడు మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన 132మంది రైతులకు రూ.1275348లు సాయం అందింది.

1895.37 ఎకరాల తొలగింపు

సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందజేస్తామని స్పష్టంచేసిన సర్కారు ఆదిశగా చర్యలు తీసుకుంది. పంటల సాగుకు యోగ్యంలేని గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, గోదాములు, ఇతర నిర్మాణాలు జరిగిన 288 ఆవాసాల పరిధిలోని 1895.37ఎకరాలను గుర్తించి రికార్డుల నుంచి తొలగించారు. ఏటూరునాగారం మండలంలో 49.36 ఎకరాలు, గోవిందరావుపేటలో 28.05ఎకరాలు, కన్నాయిగూడెంలో 24.18 ఎకరాలు, మంగపేటలో 152.39ఎకరాలు, ములుగులో 1087.02 ఎకరాలు, తాడ్వాయిలో 252.25ఎకరాలు, వెంకటాపూర్‌లో 61.27 ఎకరాలు, వెంకటాపురంలో 98.14ఎకరాలు, వాజేడు మండలంలో 140.31 ఎకరాలను రైతు భరోసా జాబితా నుంచి పక్కకుపెట్టారు.

1247 ఎకరాలకు అదనంగా రైతు భరోసా

క్రితం వాయిదాతో పోల్చుకుంటే రైతు భరోసా పథకంలో అదనంగా 1247ఎకరాలు చేరాయి. గతంలో 176386ఎకరాలకు పెట్టుబడి సాయం అందగా ఇపుడు 177633 ఎకరాలకు పెరిగింది. ప్రజాపాలన కార్యక్రమంతోపాటు వ్యవసాయ శాఖ కార్యాలయాలలో తీసుకున్న దరఖాస్తుల ఆధారంగా 2513 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా గుర్తించారు. ఫిబ్రవరి 1తో ఆన్‌లైన్ నమోదు కూడా పూర్తయ్యింది. అయితే సాయం మాత్రం ఎప్పుడు అందుతుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం



జలాభిషేకానికి ముందు రేణుక ఎల్లమ్మ దేవత ఊరేగింపు

మహాముత్తారం. ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతిష్ఠాపించిన రేణుక ఎల్లమ్మ దేవతకు గౌడ కులస్థులు సోమవారం జలాభిషేకం చేశారు. ప్రతి ఇంటి నుంచి బిందెడు నీళ్ల తీసుకొని ఊరేగింపుగా వెళ్లారు. గౌడ పూజారులైన గౌడశెట్టిల ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో పురుషులు జల బిందెలను మోయగా మహిళలు మంగళాహారతులతో గుడి చెరుకొని ఎల్లమ్మ దేవతకు జలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

కాటారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో 19వ వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో వేదపండితుడు భానుప్రసాద్‌శర్మ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వసంత పంచమి సందర్భంగా విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయకమిటీ ప్రతినిధులు, పాఠశాలల కరస్పాండెంట్స్ కార్తీక్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, వెంకటేశ్, పృథ్వీధర్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రమేష్



టేకుమట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా వెంకట్రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఈదునూరి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండలంలోని రామక్రిష్టాపూర్(టీ) గ్రామంలోని విద్యా వనరుల వేదికలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.మోయిజ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, సువర్ణరాణి, స్వామి, కార్యదర్శులుగా ఎస్.ప్రవీణ్, నాగరాజు, సురేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కొత్తపల్లిగోరి ఎంపీడీవోగా రాంప్రసాద్



రేగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిగోరి ఎంపీడీవోగా రాంప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కార్యాలయంలో రాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

రేగొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఏడునుతుల నిశీధర్‌రెడ్డి ఎన్నిక కావడంపై ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. మండలంలోని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిశీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కోకన్వీనర్ ప్రసాదరావు, మండల మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు గండ్రెడ్డి లింగారెడ్డి, సర్వోత్తమరెడ్డి, సురుగూరి రాజేందర్‌రెడ్డి, విష్ణు, సుమన్, రమణారెడ్డి, పెండెల రాజు, దయ్యాల కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

వెంకటాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నాఱు. సోమవారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను అమలుచేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చట్టాల అమలు ఉద్యమాలతోనే సాధ్యమని అన్నారు. చట్టాలను పటిష్ఠంగా అమలుచేయని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు కృష్ణబాబు, నర్సింహారావు, శంకర్, శ్రీను, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు





హేమాచల క్షేత్రంలో భక్తులు (ఇన్‌సెట్‌లో) ఉమాదేవి మూలవిరాట్

మంగపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు దేవాలయాల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల మూలవిరాట్‌లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. పట్టు వస్త్రాలు అలంకరించి భక్తులకు దర్శనాలు గావించి తీర్థప్రసాదాలను అందజేశారు. వసంత పంచమి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. మండలంలోని కమలాపురం, మంగపేట, బోరు నర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, రాజుపేట, అకినేపల్లి-మల్లారం తదితర గ్రామాల్లో దేవాలయాలల్లో ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కూడా వసంత పంచమి వేడుకలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమాలలో పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. పెరుగుతున్న సాంకేతిక మోజులో పడి సంప్రదాయాలను మరిచిపోవద్దన్నారు. వసంత పంచమిలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడమనేది అనాదిగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆశోక్, సంపత్, చిరంజీవి, గట్టయ్య, మహేందర్, వంగ నరేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లి, వరికోల్ పల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఆనంతరం సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ సరస్వతి జన్మదినం సందర్భంగా అక్షరా భ్యాసం చేయిస్తే విద్యావంతులై ఉన్నత శిఖరాలను అవరోధిస్తారనే సంప్రాదాయం ఉందన్నారు. దీనిని నేటితరం విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మెహరున్నీసా, హైమావతి, ఆయాలు శ్రావణి, విజయ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బలరాం

- వరుసగా రెండోసారి ఎన్నిక
- స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా జవహర్‌లాల్



బలరాం



జవహర్‌లాల్

ములుగు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా సిరికొండ బలరాం ఎన్నికయ్యారు. 35 ఏళ్లుగా క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన ఆయన వరుసగా రెండోసారి ఆ పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. గతంలో ఉమ్మడి భూపాలపల్లి, ములుగు జిల్లా ఉపాధ్యక్షుడిగా, ములుగు నియోజకవర్గ కన్వీనర్‌గా సేవలందించారు. ఏడాది క్రితం ములుగు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బలరాం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 20వేల ఓట్లను పొందడంతోపాటు 25వేల సాధారణ సభ్యత్వాలు చేయించడంలో బలరాం కీలకంగా వ్యవహరించారు. సభ్యత్వ నమోదులో తెలం గాణలో ములుగును మొదటి స్థానంలో నిలిపినం దుకు గుర్తించిన అధిష్ఠానం మరో సారి అధ్య క్షుడిగా అవ కాశం కల్పించింది. అదేవిధంగా వెంకటాపూర్ మండలానికి చెందిన భూక్యా జవహర్‌లాల్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

తమ నియా మకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావుకు బలరాం, జవహర్ కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెంకటాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాసం శ్రీను ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎం ప్రకటన చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల సమ్మయ్య, అభినయ్, విఘ్నేష్, శేషు, యాసం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు : సీపీఎం

గోవిందరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు సామ నాగిరెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాగిరెడ్డి సంతాపసభ జరగ్గా ఆయన పాల్గొన్నారు. అంతకుముందు కృష్ణారెడ్డి నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ 40 ఏళ్లుగా నాగిరెడ్డికి పార్టీతో అనుబంధం ఉందని, అనేక పోరాటాల్లో పాల్గొన్నారని, కార్యకర్తలు కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలిచారని కొనియాడారు. పస్రా గ్రామ ఉద్యమ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. ఆయన కుటుంబానికి సీపీఎం ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యానాల అనంతరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు అంబాల పోశాలు, మురళి, సదానందం, కృష్ణారావు, మంచాల కవిత, రాజేశ్వరి, సూర్యనారాయణ, ఉపేంద్రాచారి, రాజు, ఐలయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సౌరశక్తితో రైతులకు ఆదాయం

టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తితో రైతులకు ఆదాయం పొందవచ్చని టీజీఎన్‌పీడీసీఎల్ ములుగు డీఈ నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు బంజరు, వ్యవసాయానికి అనుగుణంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తిచేసి ఆదాయాన్ని పొందొచ్చని సూచించారు. అర్హులైన రైతులు సోలార్‌ప్లాంటు ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒక మెగావాట్ పవర్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు 3.5 నుంచి నాలుగెకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. వివరాలు నమోదు చేసుకోవడానికి డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.టీజీరెడ్కో.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 6304903933, 9000550974 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా ఇసుక నిల్వలు

వాజేడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలమైన వాజేడులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచారు. పూసూరు గోదావరి నుంచి అనుమతుల్లేకుండా నిత్యం వందలాదిగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తోడేస్తున్నారు. ఇటీవల జాతీయ రహదారి విస్తరణ పనుల నిమిత్తం సంబంధిత కాంట్రాక్టరు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తొలకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మండలంలోని జగన్నాథపురం జాతీయ రహదారి రాజీవ్‌నగర్‌కాలనీ వద్ద ఇసుక డంప్‌ను గుర్తించారు. సోమవారం ఆర్‌ఐ కుమారస్వామి ఇసుకను తోలుతున్న ట్రాక్టర్ల యజమానులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. అనుమతులు ఉంటేనే ఇసుకను తోలుకోవాలని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న డంప్‌ను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఆర్‌ఐను వివరణ కోరగా తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమను చూపుతోందని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొండిచేయి చూపడం ద్వారా స్పష్టమైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. సోమవారం ములుగులో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర జీడీపీలో తెలంగాణ వాటా 5శాతంగా ఉన్నప్పటికీ ఆ మేరకు నిధులు కేటాయించలేదని అన్నారు. నిధుల సాధనలో తెలంగాణ నుంచి ఎంపికైన 8మంది బీజేపీ ఎంపీలు వైఫల్యం చెందారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలన్నింటినీ కేంద్రం విస్మరించిందని ఆరోపించారు. కేవలం బీజేపీ, మిత్ర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అశోక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచందం, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్, పార్టీ బ్లాక్, మండలాల అధ్యక్షులు, యూత్‌కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మహేందర్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. అంతర్జాతీయ కేన్సర్‌డేను పురస్కరించుకుని ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు, గుట్కా, సిగరెట్లు, గంజాయి తీసుకోవడం వల్ల క్యాన్సర్ వస్తుందని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ప్రసాద్,సిబ్బంది సత్యకుమారి, అన్నపూర్ణ, సుజాత, నిర్మల, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని నిరసన

గోవిందరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌కాలనీకి చెందిన 34మంది లబ్ధిదారులు సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2018లో 34 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయగా ఇళ్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు విడతల వారీగా నిధులు మంజూరు కాలేదని అన్నారు. ఈవిషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అధికారికి అందజేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంచెంచెరువుపల్లి, మల్లయ్యపల్లి, నల్లగుంట గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గుడుంబాతోపాటు బెల్లం పానకం డ్రమ్ములను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈదాడుల్లో హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌బి టీం లీడర్ ప్రదీప్‌రావు, ఎస్సై బాలరాజు, ములుగు ఎక్సైజ్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో సుధీర్, డీటీఎఫ్ భూపాలపల్లి టీం లీడర్ రాజసమ్మయ్య, లింగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రజిత, తదితరులు పాల్గొన్నారు.

- వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 2వేల లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఈదాడుల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ టీఎస్ దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ములుగులోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో నిర్వహించే శిక్షణ తరగతులను జిల్లాలోని డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. సోమవారం ఆయన టాస్క్ రీజనల్ సెంటర్‌లో శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ యువతలో ప్రతిభ నైపుణ్యాలు పెంపొందించడానికి టాస్క్ ద్వారా శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. టెక్నికల్ శిక్షణలో భాగంగా జావా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్‌మెంట్, పైథాన్ ప్రోగ్రామింగ్, డేటాబేస్ అప్లికేషన్స్, సీ ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, అల్గోరిథమ్స్, సూడోకోడ్, ఫుల్‌స్టాక్ అప్లికేషన్స్‌లలో ఉద్యోగ మెళకువలు నేర్పించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు పీవో, క్లర్క్, స్పెషలిస్ట్ ఆఫీసర్స్, ఐబీపీఎస్ నోటిఫికేషన్స్, ఎస్బీఐ రూరల్ బ్యాంకులు, కోఆపరేటివ్ బ్యాంకుల నోటిఫికేషన్స్‌కు సంబంధించిన శిక్షణ జరుగుతుందని అన్నారు. పూర్తి వివరాలకు 9618449360 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సెంటర్ హెడ్ నవీన్‌రెడ్డి, క్లస్టర్ మేనేజర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

టీజీవో డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల జీవన్‌కుమార్, నాయకులు రామకృష్ణ, ప్రకాశ్‌రెడ్డి, కొమురయ్య, బి.శ్రీనివాస్, శిరీష, ఎం.రాజు, వెంకటరమణ, దేవరాజ్, జితేందర్‌రెడ్డి, శైలజ, యశ్వంత్, శంకర్, శ్రీకాంత్, బాలయ్య, నరసింహ, సారంగపాణి, రఫిక్, రహీం, రాజ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, రహీం అహ్మద్, రంజిత్, దేవేందర్‌రావు, రాజు, మాధవీశీతల్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన

వెంకటాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదాపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15రోజుల క్రితం ట్యాంకు మోటార్ మరమ్మతులకు గురైందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మోటార్‌కు మరమ్మతులు చేయించాలని పలుమార్లు పంచాయతీ అధికారులు, మండల అధికారులను కోరినప్పటికీ పట్టించు కోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈవిషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు సంఘటన ప్రాంతానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.